కథా నిలయం
శ్రీకాకుళం

# సరసాల కొంకవరస

డిప్టీ యిన్‌స్పెక్టరైన నందకిశోరరావు. అతని మిత్రుడు సింహాద్రి రావు. బోయపాడు ఉపాధ్యాయులు. వంకరాయి గ్రామం పాఠశాలలో అడుగుపెట్టేరు. వంకరాయి ఉపాధ్యాయులు వాళ్ళని ఆహ్వానించారు. ఉపాధ్యాయులు సాయం చెయ్యగా బండ్రోతు బండిలోంచి సామానులు దింపి బడిలో పెట్టేడు.

ఒళ్ళు బడలికగా ఉందని చెప్పి సింహాద్రిరావు చాపవేసుకొని సాగోరి బీడీ ముట్టించాడు. కాని పొగ పీలుస్తూంటే కొన్ని ఆలోచనలు పుట్టాయి. మన మిక్కడ ఈ అడవిలో అజ్ఞాతవాసం చెయ్యవలసిన రాత ఉంది. ముందు ముందు ఎంత గొప్పవాళ్ళం అయిపోతామో ఏమిటో ఇప్పుడు చెప్పలేం? కాని పురిటిలోనే సంధికొట్టకుండా చూసుకోవాలి. ఈ ఉపాధ్యాయులతో కూడా చేరి ఈ డిప్టీఇన్‌స్పెక్టరు మనని అవతలకి సాగనంపేడంటే పసరుమొగ్గని తుంచివేసినట్లుగా అయిపోతుంది. బతుకంతా! కాబట్టి నలుగురినీ మంచిచేసుకొని బ్రతకాలి. బంగారప్పు పళ్ళేరానికైనా గోడ చేర్పు అన్నారు జ్ఞానులు.........అయితే మొట్టమొదట చెయ్యవలసిన పనేమిటి? ఇన్‌స్పెక్టరుతో వరస ఒకటికలపాలి. ఎలాగ? అన్నదమ్ముల వరసో, తండ్రికొడుకుల వరసో, తాత మనమలవరసో. అదీకాకపోతే, మామ అల్లుళ్ళవరసో, అదీకాకపోతే మరేదో. మరేదో! వరస ఒకటి కలపడం అత్యవసరం. తదుపరికాని చనువు ఏర్పడదు.

"ఇప్పటిలో కొంప మునిగిపోయిందేమీ లేదు; కాని ముందు జాగ్రత్తతో మెలిగితె చాలామంచిది. వివేకలక్షణం అది. అయితే ఏ వరస మంచిది అని ప్రశ్నలో ప్రశ్న .........."నాకూ అతనికీ సమాన వయస్సు కదా? అటువంటప్పుడు ఏ వరస బాగా కుదురుతుంది?" అని అతను

ఒక్కొక్క వరసను గురించే ఆలోచిస్తూ "ఇదీబాగులేదు. ఇది సరికాదు" అని కొట్టిపారేస్తూ. చివరకి "మామ అల్లుళ్ళ వరసకూడా అంతగా బాగు లేదు" అని తలచి "ఇహదేనిని గురించి ఆలోచించను?" అనుకొంటూ "మిగిలింది ఒక్క బావ మరుదులవరస" అనుకొని "ఇదిబాగానే ఉంద య్యోయి! సరసాలన్నిటికీ సరిపోయిన వరస! ఈ వరసపెట్టుకొని ఎన్ని తమాషాలు చేసినా, ఎన్ని మాటలాడినా విరసంగా కనబడదు! పైగా సర సంగానే కనబడుతుంది. ఇంక ఏవరసచూసినా తల్లికి పట్టరా వసంతం అన్నమాదిరిగా ఉంది. కనుక బావమరదుల వరసే సిద్ధపరుస్తాను. ఇది బాగానే ఉందికాని, అయితే మా ఇద్దరిలో బావమరిది ఎవరు, బావగాడు ఎవరు? అదీ తర్వాత సమస్య.... అతని చెల్లెలిని నాకిచ్చినట్లా?........ మళ్ళీ అదొాత ప్రాలుదవూ. స్వర్గానికి వెళ్ళినా సవతిపోరు తప్పలేదన్నట్లు! ఇంతదూరం ఈ అడవిలోకి వచ్చింది. దాని బాధ వదుల్చుకోడానికేకాదూ! మళ్ళీ ఇక్కడకూడా దానిగొడవేనా? బాగానే వుంది? పెర్రికుదిరింది రోక లితేరా తలకి చుట్టుకొంటాను అన్నట్లుగావుంది. కాబట్టి మా చెల్లెలినే ఆతనికిచ్చినట్లు వరస కలిపిచూద్దాం." "బావగారూ!" అని పిలిచి మన్నా పనచేసినట్లుగా నటించవచ్చు అంతగా అవసరంవస్తే. లేకపోతే మామ్మో లుగా "ఏమోయ్ బావా!" అని చనువుగా పిల్చినట్లే పిల్చి వెయ్యవచ్చు" అని దీర్ఘంగా ఆలోచించాడు.

బంట్రోతు కుంపటి వెలిగించాడు. వాడు సాయం చెయ్యగా డిప్టీ ఇన్‌స్పెక్టరు నందకిషోరరావు కుక్కరును అమర్చుతూ శ్రమపడు తున్నాడు. కుక్కరుని చూడగానే సింహాద్రిరావుకి ఒళ్లు భగున మండింది. అడవిలో అన్ని బాధలకీ తోడు ఇదొకటి వచ్చిపడింది. దీని తలని కొరివి పెట్ట! రుచిగా ఇంత తినకుండా వచ్చింది. ఈ చప్పటి మెతుకులు తిని జిహ్వ చచ్చిపోతూందంటే నమ్మండి! వంకాయకూర వండితే ఎలాగుం డాలి ఏమిటి కథ! సంతర్పణ అరటికాయకూర అంటే మాటలా అలాం టిది ఈ కుక్కరుకూడు తినడం మొదలుపెట్టేక జిహ్వ సగం చచ్చి శల్యమైపోయింది. పైగా, ఆవిరిమీద ఉడికిస్తే వేడి అంటారు కొందరు

పెద్దలు. ఒకటిప్లస్, ఒకటి మైనస్ అని లెక్కవేసిచూస్తే పెద్దలమాట సున్న అయింది. అది ఎట్లాపోతే మనకేమిగాని, రుచిమాట నేను మొత్తుకోడం! చక్కగా పొయ్యిమీద గిన్నెపడవేసి, కాలు ఇటు అటు కదలకుండా యోగముద్ర వహించినవాడిలాగు కొన్ని గంటలసేపు అక్కడే కాపలాఉండి. పొగతోటి ద్వంద యుద్ధంచేస్తూ, వండిన వంటని వీరకృత్యంతో సరిపోల్చవచ్చు! అడవిలో పెద్ద పులులతో యుద్ధంచేస్తూ ప్రయాణంచెయ్యడం ఎలాంటిదో. అదీ అలాంటిదే. ఎసటిలో బియ్యంపోసి ఒక్కక్షణం అటు వెళ్ళిరండి. అన్నం మాడేనా పక్కాపోతుంది. లేక చిముడేనాపోతుంది. లేకపోతే నానుగూ మేనా అయిపోతుంది అదీ కాకపోతే పలుకు పలుకుగానేనా ఉండిపోతుంది. "ఉడికీ ఉడకని మెతుకులు" అన్న పద్యమే ఉందికదా! చూశారా వంటతో ఎన్ని పుర్రాకులున్నాయో! అమ్మాయిగారిని పొయ్యిమీద పాలుపెట్టి కాస్త వీధి గుమ్మందాక వెళ్ళి, ఒక్కమాటు చూపులు అటు ఇటు విసరి రమ్మనండి. పాలు పొంగి పొయ్యిలోపడి ఆ కంపు వీధిలోకివచ్చి అమ్మాయిగారిని దౌడుతీయించకపోతే నా చెవి కదపాయిస్తాను. నాయనా! వంట ఎంత సాధనోయ్! "సాధనమున పనులు సమకూరు ధరలోను" అని వేమనయోగిగారి వాక్యం. దాని కుక్కరు వంటకి పోలికా, గంగగోవును బొచ్చుకుక్కతో పోల్చినట్టు! నాకు ప్రతిదానికి థియరీలో నూటికి నూటపాతిక మార్కులు అనుకొంటూండగా వంకరాయి ఉపాధ్యాయుడొకడు దగ్గరకి వచ్చాడు.

సింహాద్రిరావు శరభాపురంలో ఉన్నప్పుడే ఎంకరాయి మేష్టర్లు ఇన్ స్పెక్టరుని దర్శించి. తమ పరీక్ష ఎప్పుడో తెలుసుకోడానికి వచ్చేరు. పైగా వాళ్ళు శరభాపురంనుంచి కొండపల్లికి సింహాద్రిరావుని తోడుకొని వచ్చారు కనుక సింహాద్రిరావుకి వాళ్ళు బాగా పరిచయస్థులు. ఆ చనువుని పురస్కరించుకొని ఆ ఉపాధ్యాయుడు సింహాద్రిరావు పక్కనిచేరి "పంతులుగారూ!" అన్నాడు.

ఏదో చేతిలో పడుతూందన్నట్టుగా సింహాద్రిరావు ఆదుర్దాపడి "ఏమిటి సంగతులు?" అన్నాడు.

"ఇన్‌స్పెక్టరుగారు ఎలాగు శ్రమపడుతున్నారో చూడండి పాపం! పోనీ మేము ఎవరమేనా సాయం చేద్దామంటే-వారు బ్రాహ్మలు, మడి ఆచారమున్నూ!" అన్నాడు ఉపాధ్యాయుడు విచారంలో.

అంతటిలో సింహాద్రిరావు తేరుకొని "అదే నేనూ విచారిస్తున్నా నయ్యా పంతులూ!" అని ఆలోచనా పూర్వకంగా అన్నట్టుగా కన బడ్డాడు.

కాని ఉపాధ్యాయుడు నోరువిడిచి "ఆయన వంటచేసి పెట్టడం. మీరు భోంచెయ్యడం చూస్తే నామట్టుకు ఏదో ఇదిగా ఉందండి పంతులు గారూ! నిజం చెప్పవద్దూ!" అన్నాడు.

"ఒక్క నీ మట్టుకేకాదు. నామట్టుకూ అలాగే వుంది అబ్బాయీ!" అన్నాడు సింహాద్రిరావు తనకేమీ కొత్తసంగతి తెలియచెయ్యడం లేదన్న ట్టుగా.

"మీరు కాస్త సాయంచేసిపెట్టరాదూ పాపం!" అన్నాడు మేష్టరు మర్మం లేకుండా.

"నువ్వు చెప్పేవి నాకు తెలియని సంగతా మరి! నేనూ కనిపెట్టి చూస్తున్నాను. పెద్దపులి కనిపెట్టి చూసినట్టుగా సమయంకోసం. ఏమ య్యోయ్! నా సాయం ఆమోస్తరుగా ఉండదు. తమాము ఈ కుక్కరుని తీసుకువెళ్ళి నట్టడివిలో సొంతంగా పారవేసివచ్చి. ఆయనకి నేను ఆచేతుల తోనే వంటచేసి పెడతాను. మనకి రానివిద్య అంటూ లేదుగా భూమిమీద నీ ధర్మమా అంటూ!" అన్నాడు సింహాద్రిరావు.

ఇంతటిలో ఇన్‌స్పెక్టరు "చిన్నమేష్టరూ" అని కేకవెయ్యగా ఉపాధ్యాయుడు దడబిడగా పరుగెత్తేడు.

ఉపాధ్యాయుల భావం ఒకటే అంతుపట్టింది కదా అని సింహాద్రి రావు పొంగిపోయేడు. "నేనూ వానిని గురించే ఆలోచిస్తున్నాళ్లే బలే బాగా కుదిరింది! రోగీ పాలేకోరేడు. వైద్యుడూ పాలే ఇమ్మన్నాడు అన్నట్టుగా వచ్చింది. ఈ అడవిలో మనకి ఎవరూ బాసలు లేకపోయేరే అని చాలా చాలా విచారిస్తూ వచ్చాను. ఇక ఫర్వాలేదు, ఎదుటివాళ్ళ మన

న్నులలో ఉన్న సంగతులు గ్రహించడమే కామటయ్యా బతుకులో అతి ముఖ్యవిషయం. వాళ్ళగుట్టుమట్టు తెలిసిపోయిందంటే. కోటలో జండా పాతినట్టే. ఇంక మనం కొంచెం జాగ్రత్తగా మసులుకోవాలి. మాష్టర్లకి మన ఉద్యోగాన్ని గట్టిగా బోధపరచాలి. ఇన్స్పెక్టరుకి మనం బాగా ఉపయోగపడాలి. ఇదంతా నేనూ అనుకొంటూనే వున్నాను. కాకీ వాలింది పండూ పడింది అన్నట్టుగా వచ్చింది. మనలో మనమాట! ఉత్తనే భోంచేసి కూర్చుంటూంటే ఎవడిమనస్సు ఒప్పుతుంది చెప్పండి? పైవాళ్ళ సంగతెందుకు? ఎవరేనా అలాగు చేస్తూంటే మొదట నేను ఒప్పుకొంటానా అని? అందులో ఈ కలికాలంలోనా! ఇంటిలోవాళ్ళే — అంటే. రక్తసంబంధ మున్నవాళ్ళే ఒప్పుకు చావరైరి. ఇంక పైవాళ్ళకా వచ్చి పడింది! కనుక మన వంటలో సాయపడక తప్పదు. అయితే ఒక ముఖ్యమైన విషయం. ఇన్స్పెక్టరుకి మామ్మోలు వంటకి. కుక్కగాడు వంటకే తేడా కనబరిచి. ఈ గిన్నెలు తీసుకువెళ్ళి పెంటమీద పారవేయిస్తాను. లేకపోతే నాకుతిండి అసలు సాయించడం లేదు. ఇంకో అతి ముఖ్యవిషయం! రేపుకాస్త ఏదో మేష్టర్లనోళ్ళు తీసివేసి వాళ్ళ నోళ్ళుకట్టి వెయ్యాలి వీళ్ళమంచి మనం సంపాదించుకోవాలి" అంటూ ఆలోచించాడు

ఆ రాత్రికి నందకిశోరరావు, సింహాద్రిరావు ఏదో ఇంత ఎంగిలి పడ్డారు.

నందకిశోరరావు. నరసరావు. పీటవాలుకుర్చీమీద శరీరాన్ని చేరవేశారు. ప్రక్కనున్న ఒక స్టూలుబల్ల దగ్గిరకి లాగుకొని సింహాద్రిరావు దగ్గిరచేరేడు.

"బావగారూ!" అని పిలిచేడు సింహాద్రిరావు.

ఇన్స్పెక్టరు కొంచెం పరధ్యానంగా వున్నాడు.

"బావగారూ? నిన్నే పిలవడం" అన్నాడు సింహాద్రిరావు.

ఇన్స్పెక్టరు విన్నాడు. "సరే! పిలవడం బాగానేవుంది, కాని. ఆ 'గారూ!' ఏమిటి? ఈ 'నువ్వూ' ఏమిటి?" అని విమర్శించేడు.

"బావగారితో వేళాకోళమంటే అదే! మా ఊళ్లో మా ఇంటి పక్కనే రాజుల కుటుంబం, అంటే క్షత్రియులు ఉన్నారు లెండి! వాళ్ళు ఇద్దరు అన్నదమ్ములు. వాళ్ళలో వాళ్ళకి యెప్పుడేనా జగడం వస్తుంది. తమ్ముడు అన్నతో "ఏమండీ! అన్నగారూ! మీరు పట్టి వెధవలండి!" అంటాడు. అన్న తమ్ముడితో "మీరు మరీ వేలుజోలెట్టె వెధవలండీ!" అంటాడు. తమ్ముడు అన్నతో "మీరు మా తల్లిగారి పరిశుదమైన కడుపు చెరపబుట్టిన శుద్ధ చన్నాసి చవటలండీ! పూర్తిగా శుంఠలంటే నమ్మండి?" అంటాడు. అన్న "చాలులెండి: ఈపాటికి నోరుముయ్యండి!" అంటాడు. "ఎవరికండి? సెలవియ్యండి గారు" అంటాడు తమ్ముడు. పాపం యెంత సేపు తిట్టుకొన్నా. మర్యాద వెనకకుండా ఈలాగే తిట్టుకొంటారు. కాబట్టి సంగతి యెట్లాగున్నా, మొదట మర్యాదలోపం రాకూడదు బావగారూ!" అన్నాడు సింహాద్రిరావు,

నందకిశోరరావు విని సంతోషిస్తున్నాడు.

పక్కనే నిల్చున్న పెద్దమేష్టారు" ఇవాళ ఇన్స్పెక్టరుగారు చాల శ్రమపడ్డారు ఒకటే వ్రాతపని అయిపోయింది. కాంపు కాట్ వెయ్యమని బంట్రోతుకి చెప్పమన్నారా?" అని నిద్రవేళని సూచించేడు.

ఇన్స్పెక్టరుకి బడలిక అనిపించగా "సరే!" అన్నాడు.

సింహాద్రిరావు లేచి తనపక్కె పరుచుకొన్నాడు.

ఇనస్పెక్టరు కాంపుకాటుమీద శరీరం వాల్చేడు,

—?—